క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని ట్రస్ట్ సభ్యులు పలువురికి ఆహ్వానం అందజేశారు. ఆదివారం శృంగేరి జగద్గురువులు శ్రీ విధుశేఖరభారతిస్వామీజీని దర్శించుకొని, ఆహ్వాన పత్రిక అందజేశారు. వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని తప్పక హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బగలాముఖి ఉపసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, దర్శనం మాసపత్రిక సంపాదకులు వెంకటరమణశర్మ తదితరులు ఉన్నారు.

ఇనుప స్తంభాన్ని తొలగించాలి



ప్రమాదకరంగా ఇనుప స్తంభం

నర్సాపూర్: తమ వార్డులో ప్రమాదంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించాలని మున్సిపాలిటీలోని 15వ వార్డు ప్రజలు అధికారులను కోరుతున్నారు. వార్డులో ఇనుప స్తంభం ఉందని దాని పక్కన సిమెంట్ స్తంభం ఏర్పాటు చేసి, కరెంట్ కనెక్షన్లు ఇచ్చారని, ఇనుప స్తంభం వృథాగా ఉన్నదని ప్రజలు చెప్పారు. కాగా గాలి దుమారం వచ్చినప్పుడు, కోతులు ఇనుప స్తంభాన్ని ఊపినప్పుడు పక్కనే ఉన్న కరెంట్ తీగలకు అది తగలడంతో కరెంట్ షాక్ వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మేడ్చల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కాళ్లకల్‌కు చెందిన విద్యార్థులు రాణించారు. చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్, చాంపియన్ షిప్‌లు సాధించినట్లు షన్‌షాన్ బుడోకాన్ కరాటే క్లబ్ కరాటే మాస్టార్‌లు నర్సింగరావు, మల్లేశ్, నమిక్ షాటోకాన్, కరాటే ఆర్గనైజేషన్ మాస్టర్లు జనార్దన్, ఇంద్రసేన, హరినాథ్ తెలిపారు.

ముదిరాజ్ సంఘం చేగుంట పట్టణ అధ్యక్షుడిగా లింగం



చేగుంట ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

చేగుంట(తూప్రాన్): ముదిరాజ్ సంఘం చేగుంట పట్టణ అధ్యక్షుడిగా తలారి లింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్‌తో పాటు సంఘం సభ్యులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగం, ఉపాధ్యక్షుడిగా దుంపల రాజు, కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా శ్రీనివాస్, సహకోశాధికారిగా ఎల్లంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలి'

శివ్వంపేట(నర్సాపూర్): అకారణంగా దాడికి పాల్పడిన సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేశ్‌నాయక్ డిమాండ్ చేశాడు. మండల పరిధిలోని రెడ్యా పంచాయతీ సర్పంచ్ రంగీల భర్త ఆంజనేయులు తనపై అకారణంగా దాడి చేసి గాయపరిచాడని తలకు, చేతులకు బలమైన గాయాలయ్యాయని చెప్పాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రమేశ్‌నాయక్ వివరించారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చేగుంట(తూప్రాన్): ఇబ్రహీంపూర్‌లో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అమ్మవారికి ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించగా, వాహనాలకు సైతం పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు.

చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకుల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన శ్రీ చాముండేశ్వరీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తుల స్నానం ఆచరించి, భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

వేంకటేశ్వర దేవాలయంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ వేంకటేశ్వర దేవాలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండోరోజు దివ్య ప్రబంధ పూజలను నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త కిషన్‌రావు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఎంపీటీసీ భాగ్యమ్మతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): స్నేహం దేవుడిచ్చిన వరం. దాన్ని కాపాడుకోవడం మన ధర్మమంటూ 1998–99 బ్యాచ్ విద్యార్థులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు వారి చిన్ననాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. చివరిగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లు మహిపాల్‌రెడ్డి, మల్లికార్జున శర్మ ప్రసంగించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూర్వ విద్యార్థులు చిరుజ్ఞాపిక శాలువాతో సన్మానించి, గురువులకు పాదాభివందనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

కోచ్ సూచనలు పాటించాలి

నర్సాపూర్: శిక్షణ సమయంలో కోచ్ చెప్పే సూచనలు పాటించాలని సాఫ్ట్‌బాల్ అంతర్జాతీయ క్రీడాకారుడు రజత పతక విజేత అభిషేక్‌గౌడ్ సూచించారు. నర్సాపూర్‌లోని అల్లూరి సీతరామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి, క్రీడాకారులకు పలు మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోచ్ సూచనలు పాటించాలని చెప్పారు. క్రమశిక్షణతో సాధన చేసి, ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఒరిస్సాలోని పూరిలో జరిగే 44వ జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని హితవు పలికారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక కోచ్ షానవాజ్ తదితరులు ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): డ్రగ్స్, వివిధ కేసుల్లో నిందితులకు బీఆర్‌ఎస్ చెందిన నేతలు ఫోర్జరీ సంతకాలతో జామీను పత్రాలు ఇస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు సాదుల అశోక్, హరిగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగరాజు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామ పంచాయతీ రోడు నుంచి నకిలీ ఫోర్జరీ సంతకాలతో గుర్తు తెలియని వ్యక్తులకు కోర్టుల్లో జామీను ఇస్తున్నారని ఆరోపించారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి అక్రమాలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు చెప్పారు.

పొట్టు లారీల కట్టడి ఎప్పుడు?



తూప్రాన్ - నర్సాపూర్ రోడ్డుపై వెళ్తున్న లారీ

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న పొట్టు లారీలపై సంబంధిత అధికారులు కట్టడి చేయకపోవడంతో ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. డీసీఎం, లారీలు వాటి బాడీకంటే అదనంగా పొట్టుని నింపి రోడ్డుపై వెళ్తుండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై నుంచి నిత్యం పొట్టులారీలు వెళ్తున్నా.. సంబంధిత యజమానులపై చర్యలు తీసుకోవడంలో పోలీస్, ఆర్టీఏ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా వివిధ ప్రాంతాల నుంచి వెళ్తున్న పొట్టు లారీలపై చర్యలు తీసుకోవాలి.

మున్నూరుకాపు సంఘం పట్టణాధ్యక్షుడిగా గట్టేశ్



పట్టణ మున్నూరుకాపు సంఘం, యువత మండలి నూతన కార్యవర్గం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా కొంగోటి గట్టేశ్, యువక మండల అధ్యక్షుడిగా మాడిశెట్టి సుమన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మెదక్ పట్టణంలోని ఫత్తేనగర్‌లో మున్నూరుకాపు భవన్‌లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగపతి, జిల్లా అధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం పట్టణ కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా నాయిని ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, యువత మండలి ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, కోశాధికారిగా గౌతమ్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని జగపతి సన్మానించారు. కార్యక్రమంలో యువక మండలి జిల్లా కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్, నాయకులు శ్రీధర్, నియోజకవర్గ కన్వీనర్ వీర్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ శేఖర్, నాయకులు నాగభూషణం, వెంకన్న, బాల్‌రాం, దస్తయ్య, మల్లేశం, రాము, మహిపాల్, నవీన్, శేఖర్, సిద్ధు, శ్రీనివాస్, భరత్, నర్సింలు, రూపేశ్, రమేశ్, గంగాధర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌడిపల్లి మండల సర్వసభ్య సమావేశం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తారని ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని చెప్పారు.

'ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటు చేయాలి'

మెదక్‌జోన్: బోధన్ చౌరస్తాలో క్రీడాకారుడి విగ్రహాన్ని రోడ్డు వెడల్పు సమయంలో తొలగించిన ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి స్పందించి, విగ్రహ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కొల్చారం ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారం ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నేరెళ్ల చంటయ్య, అధ్యక్షుడిగా ఆశన్నగారి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాములు, సుదర్శన్, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎండుగుల శేఖర్, కోశాధికారిగా యాదగిరి, సంయుక్త కార్యదర్శులుగా కృష్ణ, మల్లేశం, నాగరాజు, యాదగిరి, మల్లేశం, దుర్గయ్య, కార్యదర్శులుగా శేఖర్, సిద్ధి రాములు, శాఖయ్య, సత్యనారాయణ ఎన్నికయ్యారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంతో మృతి చెందిన కుటుంబ సభ్యులను మెదక్ డీసీసీ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన బోంది లింగం(40) కామారెడ్డి జిల్లా బిక్నూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీమాన్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీశంకరయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలో సోమవారం అందోల్ ఎమ్మెల్యే పర్యటించనున్నారని మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు విలేకర్లతో చెప్పారు. గడిపెద్దాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభిస్తారని చెప్పారు.

ఘనంగా సికింద్లాపూర్ జాతర



కోనేరులో స్నానం ఆచరిస్తున్న భక్తులు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కనుల పండువగా కొనసాగుతోంది. ఏటా ధనుర్మాసంలో ప్రారంభమై ప్రతీ ఆదివారం మూడు నెలల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం నాటి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానం ఆచరించి, కోనేరు పక్కనున్న లక్ష్మీనర్సింహస్వామితో పాటు గుట్టపై కొలువైన స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శశిధర్‌గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, సీనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



గరుడ సేవలో భక్తులు



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో శ్రీ తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు తిరుమల స్వామి ఆలయంలో ఆదివారం నిత్య హోమం, బలి హరణం, గరుడసేవ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుల మహేందర్, సభ్యులు సిద్దరామ్ రెడ్డి, బి.తిర్మల్, తిరుమలయ్య, గ్రామ సర్పంచ్ చప్పెట నర్సింహారెడ్డి, ఎంపీటీసీ నంద్యాల బాల్‌రెడ్డి, మహిపాల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి బూరుగడ్డలో మల్లన్న ఉత్సవాలు



ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని బూరుగడ్డలో శ్రీమల్లికార్జునస్వామి(మల్లన్న) ఉత్సవాలు ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గొల్ల కురుమ సంఘం నాయకులు తెలిపారు. 30న దేవుని లగ్గం, అగ్గిగుండాలు, బోనాలు, 31న నాగవెల్లి, ఫిబ్రవరి 1న ఎల్లమ్మ లగ్గం, బోనాలు, 2న కడుపలు కడుగుట తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జాతరకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలిపారు.

సదాశివ నగరంలో క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మధిర గ్రామమైన సదాశివ నగరంలో ఆదివారం గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గ్రామానికి చెందిన యువ డాక్టర్ శివకుమార్ టోర్నమెంట్‌లో విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలను అందజేశారు. అంతకు ముందు క్రీడాకారులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ క్రికెట్ కిట్‌ను అందించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని శివకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు ప్రభాకర్, అశోక్, యాదగిరి, శేఖర్, వెంకట్, భిక్షపతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బగలాముఖి అమ్మవారి శోభాయాత్ర



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో నిర్మించిన బగలాముఖి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు గ్రామ పురోహితుడు శాస్త్రుల పురుషోత్తమశర్మ అన్నారు. వచ్చే నెల 8 నుంచి 10 వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు. సోమవారం బగలాముఖి విగ్రహం గ్రామానికి చేరుకుంటుందని, గ్రామ శివారులో నుంచి శోభయాత్రగా ఆలయం వరకు తీసుకొని వస్తారని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. అమ్మవారి విగ్రహం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆలగడ్డలో ప్రత్యేక శిల్పి ద్వారా తయారు చేయించినట్లు వెంకటేశ్వరశర్మ తెలిపారు.

ముమ్మరంగా స్వచ్ఛభారత్



తూప్రాన్: మల్కాపూర్‌లో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ పాలకవర్గం, యువత



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో..

మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వచ్ఛభారత్ ఆదివారం 250వ వారం విజయవంతంగా పూర్తిచేశారు. ఆదివారం మండల పరిధిలోని కూచారం గ్రామానికి చెందిన నేచర్ ఐకాన్ యూత్ స్వచ్ఛభారత్ 250వ వారం సందర్భంగా గ్రామంలో పలు వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, జీడిపల్లి కార్యదర్శి సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 344వ వారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. గ్రామంలోని పలు కాలనీల్లో పిచ్చి మొక్కలను తొలగించి, చీపుర్లతో శుభ్రం చేశారు. ప్రతీ ఆదివారం 2 గంటల పాటు శ్రమదానం నిర్వహిస్తున్నామని ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు నవీన్, యాదవ్‌లు తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ వంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.